ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాలలో భాగంగా హర్ ఘర్ తిరంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ జాతీయ జెండాను కళాశాల భవనంపై ఎగురవేశారు. అనంతరం అధ్యాపకులు బోధనేతర సిబ్బంది విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి భారత్ మాతాకీ జై అని నినదించారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో ఐదవ రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బదిలీలను వెంటనే చేపట్టాలని, జీవో నెంబర్ 42 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18వ తేదీన విజయవాడలో ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశాఖ జిల్లా జిసిజిటిఏ అధ్యక్షులు డాక్టర్ చీడి విష్ణుమూర్తి పిలుపునిచ్చారు.

పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన - ఎన్టీఆర్ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అయితే వినియోగం, నిర్వహణ అనేది ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లలో సామగ్రి, ఇతర పరికరాల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ ప్రక్రియపై స్థానిక ఎమ్మెల్యేకు ముందస్తు సమాచారం అందించాలని, తదుపరి పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇల్లు స్వాధీనపరిచిన సమయంలో లబ్ధిదారుల నుంచి సంబంధిత ధృవీకరణ పత్రాన్ని తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఈ క్రమంలో వివిధ అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాని, ఆసక్తి చూపని లబ్ధిదారుల విషయంలో గ్రామసభ పెట్టి తీర్మాణాలు చేయాలని, వారి నుంచి సమ్మతి తీసుకొని అధికారిక చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనల ప్రకారం పట్టాలను రద్దు చేసి, అర్హులైన ఇతర లబ్ధిదారులకు అందజేయాలని చెప్పారు. సమావేశంలో భీమిలి, విశాఖ ఆర్డీవోలు సంగీత్ మాధుర్, పి.శ్రీలేఖ, గృహ నిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, లేఅవుట్ ఇన్చార్జి అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఈఈ, డీఈలు, ఏఈలు, వర్చువల్ విధానంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మహాసభల్లో జిల్లా సమస్యలపై చర్చ

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహమాన్

విశాలాంధ్ర - విశాఖ: ఈ నెల 23 నుండి 25 వరకు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభల్లో విశాఖ జిల్లా సమస్యలపై చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహమాన్ తెలిపారు.

ఆరిలోవ అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభల గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా విశాఖ అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించలేదని విమర్శించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వే జోన్ పనుల్లో పురోగతి లేదని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాటం ఉధృతం చేస్తామన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని విస్మరించి మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం విశాఖ ప్రజా ప్రతినిధులు కేంద్ర మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వడాన్ని ఖండించారు. బీచ్ రోడ్డులో విలువైన 14 ఎకరాల భూమిని లలూ కంపెనీకి కట్టబెట్టడాన్ని ఆక్షేపించారు. ఐటీ రంగంలో ఎటువంటి పురోగతి లేదన్నారు. ఆరిలోవ డిస్పెన్సరీలో వైద్యులను నియమించి డిమాండ్ చేశారు. ఆరిలోవ డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కె.దేవుడమ్మ, సిహెచ్. కాసుబాబు, ఆరిలోవ ఏరియా కార్యదర్శి లక్ష్మణరావు, పుష్పలత, కనకరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం పెదగంట్యాడ పోతినసన్యాసిరావు భవన్ వద్ద సీపీఐ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలే ప్రధాన ఎజెండాగా పని చేస్తున్న సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగుతాయని అన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె.వనజాక్షి, నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, కె.పోతన్న, మాధవరావు, ఈశ్వరరావు, పిల్లా పద్మ పాల్గొన్నారు.

చినముషిడివాడలో హర్ ఘర్ తిరంగా వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ పిఎఫ్ కాలని శ్రీ సాయి దేదీప్య విద్యార్థులు, కార్యకర్తలతో హర్ ఘర్ తిరంగా యాత్ర (చినముషిడివాడ మండల) బీజేపీ 95, 97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెందుర్తి బిజెపి నాయకులు, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని జాతీయ జెండా పట్టుకుని వీధుల్లో తిరుగుతూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ హర్ ఘర్ తిరంగా యాత్ర చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, జాతీయ అధ్యక్షులు నడ్డా, రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్,జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపు మేరకు 95,97వ వార్డులలో హర్ ఘర్ తిరంగా యాత్ర ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ 95, 97వ వార్డుల సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, బిజెపి నాయకులు బొడ్డు గురునాథ్, బాలసుబ్రమణ్యం, కొత్తపల్లి అప్పలరాజు, రావర్తి దుర్గాప్రసాద్, ప్రభాకర్, ఎం. ప్రసాద్, కెవిఆర్, పెదిరెడ్ల తవిటి నాయుడు, కెవిఆర్.లక్ష్మి, మాధవి, భవాని, మోహన్, ఊట పెంటారావు, ఒమ్మి వెంకటేష్, చిన్నం నాయుడు, వెంకట లక్ష్మీపతి వర్మ, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని తహశీల్దార్ కె.ఆనందరావు ముందుగా జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు దేశభక్తిని, జాతి సమైక్యతను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ ర్యాలీలో గోస్తని విద్యాపీఠ్, జిల్లా పరిషత్ హై స్కూల్, కస్తూరి బా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థులు వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు.

కార్యక్రమంలో పద్మనాభం పోలీస్ శాఖ ట్రైనింగ్ సబ్ ఇన్స్పెక్టర్ బి.గణేష్, రాజీవ్ గాంధీ మానవసేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, తమటపు నాగమణి, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఛైర్మన్‌కు గంటా అభినందన

విశాలాంధ్ర - ఆనందపురం: వేములవలస ప్రాథమిక సహకార సంఘం (పిఎసిఎస్) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రౌతు నాగరాజుకు భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. భీమిలి జనసేన పార్టీ ఇంచార్జ్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ సందీప్ పంచకర్ల ఆదేశాల మేరకు, భీమిలి నియోజకవర్గ నాయకులు శాఖరి శ్రీనుబాబు

ఆధ్వర్యంలో పిఎసిఎస్ చైర్మన్ పదవి జనసేనకు కేటాయించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. గంటా శ్రీనివాసరావు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రౌతు నాగరాజును శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు, శ్రీకాంత్, నక్క శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు బాలు, బొద్దాపు గోవింద్, ప్రశాంత్ కుమార్, నాని, ఆల్తి రాజు, సురేష్ కుమార్, వంశి తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఆపండి
దళిత గిరిజనులపై భారాలు మోపొద్దు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఆపాలని, దళిత గిరిజన చేతివృత్తిదారులపై భారాలు మోపవద్దని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, దళిత హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.చిరంజీవి అధ్యక్షతన అంబేద్కర్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జేవి ప్రభాకర్ మాట్లాడుతూ దళిత గిరిజన, చేతివృత్తిదారులకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను తొలగించడానికే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తుందని, స్మార్ట్ మీటర్లను బిగించడానికి అయ్యే ఖర్చు ప్రజలే పెట్టుకోవాలనడం అన్యాయమని అన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుండి దళిత గిరిజనులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ జగ్జీవన్ జ్యోతి పథకాన్ని స్మార్ట్ మీటర్లు బిగించి ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. చేతి వృత్తిదారులకు, నేతన్నలకూ ఉచిత విద్యుత్ ఇవ్వకపోతే చేతివృత్తులు బ్రతకవని, ఇప్పటికే పెంచిన విద్యుత్ చార్జీలతో సతమతమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వైటి దాస్, జిల్లా సహాయ కార్యదర్శి ఎంవి ప్రసాద్‌రావు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రాంబాబు, కెవిపిహెచ్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా

విశాలాంధ్ర - విశాఖపట్నం: స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఈరోజు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వద్ద నుంచి 400 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని పట్టుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్.సి.సి వలంటీర్లు ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి రాజశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ యువతలో దేశభక్తిని పెంపొందించే విధంగా అటువంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు, డీన్ కె.రమా సుధ, ఎస్ హరినాథ్, ఎన్.ఎం యుగంధర్, డి. సింహాచలం అధికారులు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఏయూ పరిపాలన భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ సిరిపురం కూడలి మీదుగా ఏయూ ఇన్ గెట్ మీదుగా పరిపాలన భవనం వద్ద ముగిసింది.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విశాఖ పోర్టులో ప్రతిజ్ఞ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: కేంద్ర సామాజిక న్యాయ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్య రహిత భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. మాదకద్రవ్యాల నుండి విముక్తి కలిగిన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను రూపొందించి ఆచరిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సాంబమూర్తి ఆడిటోరియంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సమూహ ప్రతిజ్ఞా కార్యక్రమం బుధవారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వీపీఏ శాఖాధిపతులు, అధికారులు, సిబ్బంది విస్తృతంగా పాల్గొని మాదకద్రవ్య రహిత సమాజం నిర్మాణానికి కట్టుబడి ఉంటామని పునరుద్ఘాటించారు. మాదకద్రవ్యాల వ్యసనాన్ని అరికట్టడంలో, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో బృంద కార్యక్రమాల ఆవశ్యకతను ప్రతిజ్ఞా కార్యక్రమం గుర్తు చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రచారం ఆగస్టు 1 నుండి 31 వరకు భౌతిక, ఆన్‌లైన్ పద్ధతుల ద్వారా దేశవ్యాప్తంగా 3 కోట్ల మందిని చేరుకోవడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా ఆగస్టు 13న నిర్వహించే కార్యక్రమాలు, ఇప్పటివరకు సాధించిన విజయాలను జరుపుకోవడం, ముఖ్యంగా యువతతోపాటు వివిధ వర్గాలను భాగస్వామ్యం చేయడం, మాదకద్రవ్య రహిత సమాజం సందేశాన్ని కథనాలు, ప్రదర్శనలు, అనుభవ వర్ణనలు ద్వారా బలపరచడం, సామాజిక చైతన్యాన్ని, ప్రజా ఆధారిత చర్యలను ప్రేరేపించడం లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ సందర్భంగా వీపీఏ చైర్మన్ డా. ఎం.అంగముత్తు, మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, మాదకద్రవ్య వ్యసన రహిత భారత దేశ నిర్మాణానికి జాతీయ స్థాయి ప్రయత్నాలకు వీపీఏ అంకితభావంతో సహకరిస్తుందని తెలిపారు. ఈ సమాచారాన్ని పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్ మీడియాకు విడుదల చేశారు.



జీవీఎంసీ అభివృద్ధికి రెవెన్యూ వసూలుపై దృష్టిసారించండి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ అభివృద్ధి కొరకు రెవిన్యూ వసూలుపై అధికారులు దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి,రమణమూర్తి, డిసి (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు, ప్రాజెక్టు డైరెక్టర్ (యుసిడి) పి.ఎమ్.సత్యవేణి, జోన్ల కమిషనర్లు, డిపిఓ మనీషా త్రిపాఠి, రెవిన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ తో పాటు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్నుబకాయిలను ఆగస్టు 31 నాటికి 100 శాతం వసూలు చేయాలని, 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నులను 60 శాతం ఆగస్టు 31 నాటికి వసూలు చేయాలని ఆదేశించారు. వార్డ్ సచివాలయం అడ్మిన్ కార్యదర్శిలు డోర్ టు డోర్ సర్వే నిర్వహించి ఆస్తి పన్నులు విధించలేనివి, అలాగే ఆస్తి పన్నులు విధించవలసిన ఆస్తులను వెంటనే గుర్తించడంతో పాటు తాగునీటి కనెక్షన్ ఉంటే వారి ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను చార్జీలు చెల్లిస్తున్నది లేనిది పరిశీలించాలన్నారు. ఆగస్టు 20వ తేదీకి పరిశీలించిన ఆస్తుల వివరాలను నివేదించాలన్నారు. ఆస్తి పన్నుల ఆస్తుల గుర్తింపు చర్యలలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన రెవిన్యూ అధికారులు బి.అప్పలరాజు, కేఎస్.పడాల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిసిఆర్‌ను ఆదేశించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాలలో నివాసము లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి వారికి కేటాయించిన గృహాలను రద్దు చేయుటకు నివేదిక సిద్ధం చేశామని, ఇంకొంత మంది లబ్ధిదారులను గుర్తించవలసి వున్నదని కమిషనరుకు యుసిడి ప్రాజెక్టు డైరెక్టరు పి.ఎమ్ సత్యవేణి తెలిపారు.

అమెరికా సుంకాలపై నిరసన

విశాలాంధ్ర - విశాఖ: మన దేశంపై అమెరికా పెత్తనం రోజు రోజుకీ పెరుగుతోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ ఖండించారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జగదాంబ బస్టాప్ వద్ద బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా చర్యలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయని అన్నారు. అమెరికా దుర్మార్గ చర్యలను ప్రధాని ఖండించకుండా మౌన పాత్ర పోషించడాని విమర్శించారు. అమెరికా పెత్తనంపై ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నా ప్రధాని మాత్రం అమెరికా అడుగులకు మడుగులొత్తే విధంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. అత్యధిక జనాభా గల భారతదేశం గొప్ప ప్రజాస్వామ్య దేశమన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడవలసిన ప్రధాని అమెరికా చెప్పినట్లు నిర్ణయాలు తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించాలని అన్నారు. పెంచిన సుంకాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎం. మన్మధ రావు, ఉపాధ్యక్షులు ఎస్కే రెహమాన్, జె. రామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు సిహెచ్. కాసుబాబు, చెల్లూరి బుజ్జి, కె.తిరుపతిరావు, మీసాల శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, అధ్యక్షులు శ్రీనివాసరావు, జగన్, మణి, వై.రాజు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - మధురవాడ: ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను తెలియజెప్పడానికి, ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కలిగించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ర్యాగింగ్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమాన్ని గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధానికి నిర్దేశించిన చట్టాలను విద్యార్థులకు వివరించారు. విద్యా సంస్థలలో విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలు, పోటీ వాతావరణం ఉండాలని ర్యాగింగ్ వంటి విష సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వి.జి.రెడ్డి, గీతంలోని వివిధ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు, విద్యార్థులు తరితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాగింగ్ వ్యతిరేక నినాదాలుతో ర్యాలీని నిర్వహించారు.

భారీ ట్రాక్టర్ ర్యాలీతో రైతు సంబరాలు

స్వయంగా ట్రాక్టర్ నడిపిన ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - తగరపువలస: రైతు సంబరాల్లో భాగంగా బుధవారం తగరపువలస జంక్షన్ నుంచి భీమిలి మార్కెట్ యార్డ్ వరకూ భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన రైతన్నలు నిర్వహించిన భారీ ట్రాక్టర్ ర్యాలీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ వారిని ఉత్సాహపరిచారు. తగరపువలస, రేఖవానిపాలెం, బ్యాంక్ కాలనీ, కీతిన్ పేట మీదుగా మార్కెట్ యార్డ్ వరకూ సుమారు గంటన్నర పాటు ర్యాలీ జరిగింది. 100 మందికి పైగా రైతులు ట్రాక్టర్లతో హాజరయ్యారు. ఆరు కిలో మీటర్ల మేర ఈ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దేశానికి అన్నం పెట్టే రైతుకు ఎలాంటి కష్టం రాకుండా కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా ఉంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. ముందుగా తగరపువలస జంక్షన్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి.. అనంతరం గంటా శ్రీనివాసరావు ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో భీమిలి మార్కెట్ యార్డ్ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మి, లొడగల అప్పారావు, కూటమి నాయకులు గాడు వెంకటప్పడు, బి.ఆర్.బి. నాయుడు, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, కె.దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, కొప్పల రమేష్, గంటా నూకరాజు, గాడు అప్పల నాయుడు, మంగాదేవి, శాఖారి శ్రీనివాస్, సరగడ అప్పారావు, గుద్దాల ఎల్లయ్య, అక్కరమాని వెంకట్రావు, సురాల సత్య వరప్రసాద్, కె.శ్రీకాంత్ రాజు, దండి వెంకటేష్, పాండ్రంగి అప్పలరాజు, గరే గుర్నాథ్, నాగోతి సత్యనారాయణ, అచ్యుతరావు, ఎర్ర రాజు, మామిడి దుర్గారావు, మొకర అప్పలనాయుడు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రండి

- ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపికృష్ణ

విశాలాంధ్ర - గాజువాక: మరణానంతరం అవయవదానానికి ఔత్సాహికులు ముందుకు రావాలని అగనంపూడి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపికృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం అగనంపూడి ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ అవయవదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అఖిలభారత అవయవ శరీరదాతల సంఘం ఆధ్వర్యంలో శరీర అవయవాల పోస్టర్ను ముఖ్య అతిథి డాక్టర్ పి.గోపికృష్ణ ఆవిష్కరించారు. అనంతరం అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో విశిష్ట సేవలు అందిస్తున్న ట్రస్ట్ మెంబర్ కొల్లివర వెంకటేశ్వర ప్రసాద్ ని అభినందించి మాట్లాడుతూ అవయవ దానం చేయండి ప్రయాణ దాతలు కండి ప్రతి వ్యక్తి శరీరం నుండి 11 రకాల అవయవాలను దానం చేయొచ్చు అన్నారు. బ్రెయిన్డెడ్ అయిన వ్యక్తి శరీరం నుంచి గుండె, రెండు జతల కావటాలు, కిడ్నీలు, నేత్రాలు కాలేయము, ఊపిరితిత్తులు, క్లోమం, ప్రాంకియాస్ కర్ణభేరి, గాల్ బ్లేడర్, యూరినరీ బ్లేడర్, ఎముకలు, కండరాలు ఎముకల్లోని మజ్జ వంటివి, సహకరిస్తాయని తెలిపారు. ట్రస్ట్ మెంబర్ కొల్లివర వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రాణం ఉన్నంతవరకు ఈ దేహానికి ఎన్నో సొబగులు మరెన్నో అలంకారాలు ఈ దేహం మీద ఎంత మోహమో మరింత మమకారము అదే దేహం ప్రాణం పోయాక మట్టిలో మట్టిలా మారాలి అగ్నికి ఆహుతి కావాలి కావున అవయవ దానం చేయండి మరో వ్యక్తికి ప్రాణాన్ని కల్పించండి అన్నారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఏవో డి రవిరాజు, అగనంపూడి లైన్స్ క్లబ్ డైరెక్టర్ ఆదారి వెంకట కృష్ణారావు, ఓం శాంతి బికె రామకోటి, 85 వార్డు తెలుగు యువత అధ్యక్షులు బండారు చందు రమేష్, సీనియర్ టిడిపి నాయకులు పలక అచ్యుత్ పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర. సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

సెక్యూరిటైజేషన్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు

వీహెచ్ఎఫ్‌సిఎల్ నుండి పొందిన పరపతి సౌకర్యాల యొక్క వడ్డీ మరియు అసలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు పరపతి సౌకర్యాలు నిరర్ధక ఆస్తులుగా మారాయని వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ముంబైలోని దాని ప్రధాన కార్యాలయం ద్వారా ఈ క్రింది రుణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులకు నోటీసు జారీ చేయడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద వారికి ఈ నోటీసులు జారీ చేయబడ్డాయి. అయితే అవి వారికి అందజేయబడక తిరిగి వచ్చినందున బహిరంగ నోటీసు మార్గంలో వారికి దీని గురించి తెలియజేయడమైనది.

రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎక్కౌంట్ నం.	సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి	తనఖాపెట్టబడిన ఆస్తి యొక్క వివరాలు
గుణరాజు బండి (రుణగ్రహీత), శ్రీమతి సత్య వెంకట దుర్గ సంధ్య బండి (సహ రుణగ్రహీత) HL0000000076386	13-జూన్-25/ తదుపరి వడ్డీ మరియు దానిపై చార్జిలతో 11-జూన్-25నాటికి రూ.2216581/-	విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం ఎస్ఆర్‌ఓ, రేసపువానిపాలెం గ్రామం, సీతమ్మపేట లో 540 ఎస్ఎఫ్‌టితో మొత్తం గ్రౌండ్ ఫ్లోర్‌తో పాత ఎస్.నం. 40 మరియు కొత్త ఎస్.నం.18/1 సిఆర్, డి.నం.50-76-7, అసెస్‌మెంట్ నం.46980 ద్వారా వ్యాపించియున్న 61.16 చదరపు గజాలు లేదా 51.14 చదరపు మీటర్ల స్థలం నుంచి 20.38 చదరపు గజాల విస్తీర్ణపు అవిభాజ్య మరియు అనిర్దిష్ట భూమి వాటా మొత్తంగా. హద్దులు: ఉత్తరం- 5 అడుగుల వెడల్పు ఉమ్మడి నడక దారి/ 5 అడుగుల వెడల్పు ఉమ్మడి నడక దారి, దక్షిణం - శ్రీమతి బండి కమలకి చెందిన స్లాబ్ ఇల్లు/ శ్రీమతి బండి కమలకి చెందిన స్లాబ్ ఇల్లు తూర్పు: - 5 అడుగుల వెడల్పు ఉమ్మడి దారి / 5 అడుగుల వెడల్పు ఉమ్మడి దారి. పడమర-శ్రీమతి గుడివాడ వెంకట రత్నంకి చెందిన స్లాబ్ హౌస్ / మెట్లు మరియు కారిడార్

నోటీసు సర్వీసుకు ప్రత్యామ్నాయంగా ఈ చర్యలు తీసుకోబడును. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు మొత్తం బకాయిలు చెల్లించవలెనని పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (ఎక్కడైనా వర్తించే చోట)కు సూచించడమైనది. విఫలమైన పక్షంలో ఈ నోటీసు తేదీ నుంచి 60 రోజుల గడువు ముగిసిన తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి. దయచేసి పేర్కొన్న నోటీసు సెక్షన్ 13(13) ప్రకారం రుణగ్రహీతలకు/గ్యారంటీదారులకు/ తనఖా పెట్టిన ఆస్తిని విక్రయించరాదని/ లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయరాదని తెలియజేస్తోందని తెలియజేయండి. చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం పైన పేర్కొన్న తనఖాపెట్టిన ఆస్తిని విక్రయించరాదని/ లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయురాదని రుణగ్రహీతలకు/ హామీదారులకు/తనఖాదారులకు తెలియజేసినట్లు కూడా దయచేసి పేర్కొన్న నోటీసును భావించవలెను.

తేదీ: 14.08.2025
ప్రదేశము: విశాఖపట్నం

అధీకృత అధికారి,
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

పంద్రాగస్టు వేడుకలను విజయవంతంగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయటంతో పాటు అధికారులంతా సమన్వయం వహించి విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం జరగనున్న వేడుకల నేపథ్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం సాయంత్రం ఏర్పాట్లపై తుది విడత సమీక్ష చేశారు. ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లపై ఆరా తీయటంతో పాటు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శకటాలు, స్టాళ్లు, సీటింగ్ ఏర్పాట్లలో జాగ్రత్త వహించాలని, ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. ఒక వేళ వర్షం వచ్చినా కార్యక్రమ నిర్వహణకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు చెప్పారు. వాటర్ ప్రూఫ్ టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మైదానాన్ని అన్ని రకాలుగా సిద్ధం చేయాలని, బాగా రోలింగ్ చేయాలని, వర్షం వచ్చినట్లయితే చిన్నసైజు చిప్స్ ను వేసేందుకు వీలుగా అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విశాఖను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చుదిద్దుదాం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్టణాన్ని మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చుదిద్దుదామని, ఈ మహా యజ్ఞంలో అందరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజలు, యువత సమష్టి కృషి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ నిర్దేశాల మేరకు జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది చేత జిల్లా కలెక్టర్ నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. యువత ఏ దేశానికైనా ప్రధాన శక్తి, దేశ అభివృద్ధిలో వారి పాత్ర ముఖ్యమైనది, మాదక ద్రవ్య రహిత భారతదేశ ప్రచారంలో యువత పెద్ద సంఖ్యలో చేరాలి అనే సారాంశాన్ని చదివి వినిపించారు. మన కుటుంబ సభ్యులు, స్నేహితులే కాకుండా మనం కూడా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కె. కవిత, ఈగల్ విభాగం సీఐ కల్యాణి, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ ప్రతినిధి ఉమారాజ్, ఎన్.సి.బి. అధికారులు, సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల ఉన్నతికి ఆలోచించిన నాయకుడు జగన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఎస్సీలను ఉన్న స్థితి నుండి ఉన్నతి స్థితికి తీసుకు వెళ్లాలని ఆలోచించిన నాయకుడు వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి అని వై. సి. పి జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు అన్నారు. బుధవారం వైసీపీ నగర కర్యాలయంలో నిర్వహించిన జిల్లా ఎస్.సి విభాగం ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. చిత్తశు ద్ధి, సమానత్వ దృక్పథంతో ఈ వర్గాన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉన్నత స్థానంలో కూర్చోబెట్టిన నాయకుడు ఆయననే అని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విజయవాడ నగర మధ్యలో డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనని గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ఎస్.సి సామాజిక వర్గం రాజకీయ, ఆర్థిక, సామాజికంగా బలపడకూడదనే దురుద్దేశంతో దాడులు చేస్తోందని విమర్శించారు. పార్టీని మరింత బలపరిచి, ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఉన్నది ఉన్నట్టుగా అమలు చేసిన వ్యక్తి వైఎస్ జగన్ అన్నారు. రాష్ట్ర ఎస్.సి విభాగం అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ దళితులుగా ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అని చంద్రబాబు అన్నారని, మిమ్మల్ని గద్దె దింపే వరకూ నిద్రపోయేది లేదన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పసుపులేటి బాల రాజు, రాష్ట్ర ఎస్.సి విభాగం కార్యనిర్వాహక అధ్యక్షులు కొమ్మూరి కనక రావు , శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి , డా. కుంభా రవిబాబు , సమన్వయ కర్తలు వాసుపల్లి గణేష్ కుమార్, మొల్లి అప్పారావు , తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి , మాజీ శాసన సభ్యులు తైనాల విజయ కుమార్ , చింతలపూడి వెంకట రామయ్య , డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్ , పార్టీ కార్యాలయం ఇన్ చార్జ్ రవి రెడ్డి , రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ , పెర్ల విజయ్ చంద్ర , పార్టీ నాయకులు ద్రోణం రాజు శ్రీవాత్సవ్, రవి రాజు, జహీర్ అహ్మద్ , ఎస్.సి విభాగం జిల్లా అధ్యక్షులు బోని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆట విడుపు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: జీవీఎంసీ కాంట్రాక్టర్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 పురస్కరించుకొని కాంట్రాక్టర్లకి ఆటవిడుపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కాంట్రాక్టర్లందరికీ నాలుగు రకాలైన ఆటలు చెస్, క్యారమ్స్, షటిల్, బ్యాట్మెంటన్, క్రికెట్ ఆటలలో అందరూ భాగస్వాములై చక్కటి నైపుణ్యం కల్పించి ఈ ఆట విడుపు వేడుకలో కాంట్రాక్టులు అందరూ పాల్గొని చక్కటి ప్రతిభ కాంట్రాక్టర్లు కనబరిచారు. జీవీఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు అధ్యక్ష, కార్యదర్శి నాగరాజు, సంజీవరెడ్డిలు కాంట్రాక్టులు అందరినీ అభినందించారు. చెస్ విన్నర్ వి.రామకృష్ణ, రన్నర్ కాల సుధాకర్, క్యారం బోర్డు సింగల్ విన్నర్ యలమంచిలి రమేష్, రన్నర్ మద్దాల రమేష్, షటిల్ బ్యాట్మెంటన్ విన్నర్ వి.రామకృష్ణ, రన్నర్ చక్రవర్తి, క్రికెట్ విన్నర్స్ ఎస్వి రామయ్యలు గెలిచారు. కార్యక్రమంలో అధ్యక్షులు పి వి వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం సంజీవరెడ్డి, ట్రెజరర్ సిరికి శ్రీనివాసరావు, ఏ ఆర్ కన్స్ట్రక్షన్స్ అప్పలరాజు, కే నారాయణరావు, జి.సింహాచలం పాల్గొన్నారు.

ఆహబ్‌లో నూతన సంస్థ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టార్టప్ ఇంకుబేషన్ సెంటర్ ఆహబ్ ప్రాంగణంలో నూతన సంస్థ ను ప్రారంభించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ. ఎన్ ధనుంజయరావు ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జిక్విషన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించారు. సంస్థ అందించే సేవలు, తదితర అంశాలను సంస్థ సీఈవో ఎం.కోటేశ్వరరావు, సిటిఓ పి. సురేష్ బాబులు వివరించారు. సంస్థ నిర్వాహకులను ఆచార్య ధనంజయ రావు అభినందించారు. మానవులకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధార్ సేవల తరహాలో పశువులకు గో ధార్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ అంశంపై ఆగ్జిక్విషన్ సంస్థ పనిచేస్తుంది. ఈ కార్యక్రమంలో ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె. వెంకట్రావు, ఆ హబ్ సీఈఓ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య విద్యార్థి ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఐక్య విద్యార్థి ఉద్యమం ప్రారంభించి 89 ఏళ్లు కాగా భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆంధ్ర యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఏ యూ మెయిన్ గేట్ వద్ద ఎస్ఎఫ్ఐ జండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి డి వెంకటరమణ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేక భారతదేశ స్వతంత్రం కోసం 1936లో ఐక్య విద్యార్థి సంఘం ఏర్పడిందని ఈ తరుణంలో విద్యార్థి ఉద్యమాలు నడిచాయని. ఈ ఉద్యమాల్లో అనేకమంది విద్యార్థి అమరవీరులు తన ప్రాణాలు సైతం అర్పించారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు , ఎస్ఎఫ్ఐ ఏయూ అధ్యక్షురాలు కుసుమాంజలి , ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు కౌశిక్, నరేష్, ఎస్ఎఫ్ఐ ఆంధ్ర యూనివర్సిటీ కమిటీ సభ్యులు సోమేశ్, సంజయ్, నిఖిల్, సూర్య, తులసి , తదితరులు పాల్గొన్నారు.

100 అడుగుల జెండాతో హర్ ఘర్ తిరంగ యాత్ర

విశాలాంధ్ర - ఆనందపురం: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆనందపురం మండలం వేములవలస గ్రామంలో మండల బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ యాత్రను ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి రెండు రోజుల ముందే నిర్వహించిన ఈ యాత్ర గ్రామంలో దేశభక్తి ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. ఈ సందర్భంగా 100 అడుగుల పొడవైన జాతీయ పతాకంతో గ్రామ వీధుల గుండా ర్యాలీ నిర్వహించగా, పలు విద్యాసంస్థల నుండి సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో వేములవలస వీధులు మార్మోగాయి. బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు అడ్డూరి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దానేష్, చక్రవర్తి, దక్షిణామూర్తి, ఉప్పాడ అప్పారావు, రామలక్ష్మి, తాతాజు అప్పారావు, కోరాడ నవీన్, ఎస్. నాయుడు, ప్రసాద్ రావు పట్నాయక్, మీసాల రామునాయుడు, గండ్రెడ్డి వెంకటరావు, పోతిన జీవన్, డి.పి.జె.ఎస్.వి. రత్నం, మాదబతుల బుజ్జి, అడ్డూరి ఆనంద్ రవి, సీతం నాయుడు, దంతులూరి సుధాకర్ వర్మ, కే.వి.యన్. కృష్ణారావు (గోపి), ఇల్లిపిల్లి వెంకట్, సీపాన సరిత, ఎస్.ఏ. నరసింహరావు, ఇల్లిపిల్లి అచ్యుత్, పొన్నాడ శ్యామలరావు, ఉప్పాడ సీతారాంతదితరులు పాల్గొన్నారు. తరువాత మహాత్మా గాంధీ, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించి గౌరవ నివాళులు అర్పించారు.

ఇండిపెండెన్స్ డే కప్ చెస్ టోర్నమెంట్

విశాలాంధ - పెందుర్తి: ఆచార్య చెస్ అకాడమీ ఆధ్వర్యంలో, ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఇండిపెండెన్స్ డే కప్ ఆగస్టు 15, 2025 న విశాఖపట్నం, బివికే జూనియర్ కాలేజ్, విశాలక్షి నగర్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆల్ విశాఖ చెస్ అసోషియేషన్ ప్రెసిడెంట్ ఆర్.బాబూ రావు ఓ ప్రకటనలో తెలియచేసారు. మొత్తం నగదు బహుమతులు 60 వేలు అంది స్తామని, మొత్తం బహుమతులు 209 (ఓపెన్ కేటగిరీ విభాగాలు - బాలురు, బాలికలు వేర్వేరుగా) ఉంటాయని ఆయన తెలిపారు. బెస్ట్ వెటరన్, బెస్ట్ ఉమెన్, బెస్ట్ పిహెచ్ సి, , బెస్ట్ జిల్లా ఆటగాళ్లుగా బహు మతులు అందచేస్తామన్నారు. పోటీలలో పాల్గొనే వారందరికీ సర్టిఫికేట్లు, 20 లక్కీ డిప్ ప్లేమోర్ కూపన్లు అందచేయనున్నట్లు బాబూరావు తెలిపారు. అన్ని వయసుల చెస్ క్రీడాకారులు ఈ మహోత్సవంలో పాల్గొనవచ్చునని వెల్లడించారు.

ఆదర్శ్‌లో హౌస్ కెప్టెన్లను అభినందించిన సెక్రటరీ టి.థియోఫిలస్

విశాలాంధ - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజ్‌లో 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లను కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్. టి. థియోఫిలస్అభినందించారని ప్రిన్సిపాల్ ఎన్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ప్రతి సంవత్సరం ఆదర్శ్‌లో విద్యార్థుల మధ్య ఆటల పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఈ పోటీలలో మహిళా విద్యార్థులు తరపున 4 హౌస్‌లు 1.సైనా నెహ్వాల్ హౌస్ కెప్టెన్ భూలక్ష్మి 2 సింధు హౌస్ కెప్టెన్ స్పందన , 3.మేరీ కామ్ హౌస్ కెప్టెన్ లలిత , 4.ఝాన్సీ రాణి హౌస్ కెప్టెన్ కీర్తన వ్యవహరించారని తెలిపారు. పురుష విద్యార్థులు 4 హౌస్‌లు 1. నేతాజీ హౌస్ కెప్టెన్ ప్రదీప్ 2.శివాజీ హౌస్ కెప్టెన్ దివాకర్ 3.అల్లూరి హౌస్ కెప్టెన్ అజీత్ 4.ఆజాద్ హౌస్ కెప్టెన్ సుమంత్ వ్యవహరించారని చెప్పారు. ఆదర్శ్ ఫిజికల్ డైరెక్టర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ స్పోర్ట్స్ మీట్ లో వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ రావు, రాజకుమార్ ఎన్ఎస్ఎస్ 3 యూనిట్లు ఆఫీసర్స్ మంజుల, సంధ్యారాణి, ప్రదీప్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డి. సింహాచలం, ఏఓ రవిబాబు పర్యవేక్షించినట్లు ప్రిన్సిపల్ తెలియచేసారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రేమ పెళ్లి, భర్తకు వేధింపులు

విశాలాంధ్ర - పెందుర్తి : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకొని ప్రేమ పేరుతో గుంటూరు జిల్లాకు చెందిన ఓ యువతి నాటకమాడి బలవంతంగా పెళ్లి చేసుకుని ఇప్పుడు వేధింపులకు గురిచేస్తుందంటూ జీవీఎంసీ 90వ వార్డు ఆర్ఆర్ వెంకటాపురానికి చెందిన రావి రాఘవ అనే యువకుడు లబోదిబోమంటున్నాడు. ఋషికొండ సమీపంలో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న తనకు గుంటూరుకు చెందిన ఓ యువతి ఇన్స్టాగ్రామలో పరిచయం అయిందని తర్వాత ప్రేమిస్తున్నా నంటూ పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో చర్చిలో వివాహం చేసుకున్నట్లు రాఘవ తెలిపాడు. ఆ తర్వాత ఆమె వ్యవహార శైలిపై అనుమానం రావడంతో కాల్ డేటా తీసి పరిశీలించగా ఆమెకు ఇతరులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. గతంలోనే ఆమెకు రెండుసార్లు వివాహం జరిగినట్లు స్థానికుల ద్వారా తెలిసిందని దీనిపై ప్రశ్నిస్తే తనను తన కుటుంబాన్ని చంపుతాను అంటూ బెదిరించి పది లక్షలు ఇస్తే విడాకులు ఇస్తానంటూ బ్లాక్మెయిల్ చేస్తుందని రాఘవ ఆందోళన వెలిబుచ్చారు. అంతేకాకుండా గుంటూరు నుండి పదిమంది రౌడీలను తీసుకువచ్చి తన ఇంటిపై దాడి చేయించిందని చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురి చేసిందని తెలిపాడు. ఆ సమయంలో తాము ఇంట్లో లేకపోవడంతో బతికిపోయామని లేకుంటే మమ్మల్ని చంపేసి ఉండేదని చెప్పారు 10 లక్షలు ఇవ్వకపోతే తన కుటుంబాన్ని చంపుతానని బెదిరిస్తోందని తనకు తన కుటుంబానికి రక్షణ కల్పించాలని రాఘవ పోలీసులను కోరుతున్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న రెవెన్యూ మంత్రి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 15వ తేదీన పోలీసు పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయా జిల్లాలకు పతాకావిష్కరణ నిమిత్తం మంత్రులను నామినేట్ చేస్తూ రాష్ట్ర పరిపాలనా విభాగం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విశాఖపట్నం జిల్లాకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ను నామినేట్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు .ఈ క్రమంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి సమక్షంలో విశాఖలో జిల్లా స్థాయి వేడుకలను నిర్వహించేందుకు, ఆయన చేతుల మీదుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలు అర్ధరహితం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి అన్నారు. రాహుల్ గాంధీ ఒకటి, రెంటు రాష్ట్రాలలో జరిగిన ఉదాహరణ తీసుకున్నారని, ఈసీ పై చేస్తున్న పోరాటంలో దేశ వ్యాప్తంగా జరిగిన ఓటు చోరీ పై విచారణ చేయాలనేది కాంగ్రెస్ డిమాండ్ అని ఆమె అన్నారు. రాహుల్ పోరాటానికి దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయని వైసీపీ ఎందుకు మద్దతు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్యం ఠాగూర్ అన్ని పార్టీ సమావేశాలలో చంద్రబాబు పై కూటమి పార్టీల పై మాట్లాడారని, సందేహం ఉంటే మీ సొంత పత్రిక విలేకరులను పార్టీ సమావేశాలకు పంపించి ఉండవలసిందని ప్రియాంక అన్నారు. ఈసీకి, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే సాహసం జగన్ మోహన్ రెడ్డి ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు.

స్కోడా ఆటో వార్షికోత్సవం సందర్భంగా కైలాక్, కుషక్, స్లావియా పరిమిత ఎడిషన్‌లు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశ వ్యాప్తంగా 25వ వార్షికోత్సవం, విశ్వవ్యాప్తంగా 130 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్కోడా ఆటో వారి ఉత్తమ-విక్రయ మోడల్ లైన కైలాక్, కుషక్, స్లావియాల పరిమిత ఎడిషన్‌లను పరిచయం చేసింది. ఈ ఎక్స్‌క్లూజివ్, పరిమిత-స్థాయి ఎడిషన్‌లలో విలక్షణ రూపకల్పన మెరుగుదలలు, ప్రీమియం ఫీచర్‌లు ఉన్నాయి, వీటితో పాటు 25వ వార్షికోత్సవాన్ని ప్రతిబింబించే బ్యాడ్జింగ్, భారత మార్కెట్లో బ్రాండ్‌కు సంబంధించి నిరంతర అంకితభావం కూడా ఉన్నాయి. ఈ పరిమిత ఎడిషన్‌లు ఇప్పటికే ఉన్న హై-స్పెసిఫికేషన్‌ల ఆధారంగా తయారుచేయబడ్డాయి. అంటే కుషక్, స్లావియా ల కోసం మాంటే కార్లో, కైలాక్ కోసం ప్రెస్టేజ్ సిగ్నేచర్ ప్లస్ ట్రిమ్స్ ఉన్నాయి. బ్రాండ్ 25వ వార్షికోత్సవం, ఇంకా పరిమిత ఎడిషన్ మోడళ్ల ఆవిష్కరణ గురించి స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్త మాట్లాడుతూ తాము స్కోడా ఆటో "మేము భారతదేశ 25వ వార్షికోత్సవాన్ని కైలాక్, కుషక్, స్లావియా పరిమిత ఎడిషన్‌లతో వేడుకగా జరుపుకుంటున్నాం అన్నారు. మా అభిమానులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక ఎడిషన్‌లను రూపొందించాం. స్పోర్టీ కనిపించే ఎలిగెన్స్‌తో పాటు కాంప్లిమెంటరీ యాక్సెసరీల కిట్‌తో సహా ప్రీమియం ఫీచర్‌లు, ఇంకా డ్రైవింగ్ అనుభూతిని మెరుగుపరిచే స్మార్ట్ ఆవిష్కరణలు కూడా ఉన్నాయన్నారు. మా ప్రయాణంలో భాగమైన కుతూహలమైన అభిమానులకు ఇది మేము ఇస్తున్న కానుక, వినియోగదారుల ప్రాధాన్యతలకు ప్రాముఖ్యతను ఇస్తూ ప్రోడక్ట్‌లను అందించే మా బలమైన అంకితభావానికి ఇది నిదర్శనం. ఇప్పటివరకు, ఇప్పుడు, ఇక మీదట కూడా ఇలాగే అంకితభావంతో ఉంటామని హామీ ఇస్తున్నాం." అని చెప్పారు.

17న శ్రీ భూలోకమాత పండుగ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం లోడగలవాని పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఆనందపురం హై స్కూల్, బీసీ యాదవుల కాలనీ సమీపంలో గల శ్రీ శ్రీ శ్రీ భూలోకమాత అమ్మవారి వార్షిక పండుగను ఈ నెల 17న ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సన్నాహాలు ముమ్మరం చేసింది. గ్రామస్థుల ఐక్యంతో జరగనున్న ఈ పండుగలో, ఉదయం అమ్మవారికి పసుపు-కుంకుమలు సమర్పించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు గ్రామంలోని దేవుడి ఇంటి నుండి ఆలయం వరకు శోభాయాత్ర (ఊరేగింపు) నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఆలయంలో అనుపు ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశమున్నందున, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్ల కోసం ఆనందపురం పోలీస్ స్టేషన్ హౌస్ అధికారికి వినతిపత్రం సమర్పించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాన్ని సాంప్రదాయపూర్వకంగా, శాంతియుతంగా నిర్వహించనున్నామని స్పష్టం చేశారు.

రాణించిన రాయల్స్ ఆఫ్ రాయలసీమ బౌలర్లు

విశాలాంధ్ర - పీఎం పాలెం: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ -4లో భాగంగా ఏసీఏ విడిసిఏ మైదానం వేదికగా బుధవారం మధ్యాహ్నం జరిగిన 10వ మ్యాచ్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ - తుంగభద్ర వారియర్స్ జట్లు తలబడ్డాయి. తొలిత బ్యాటింగ్ చేసిన రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆర్ వికెట్ల కోల్పోయి 191 పరుగులు చేయగా 192 పరుగులు విజయలక్ష్యం తో బరిలో దిగిన తుంగభద్ర వారియర్స్ 17.2 ఓవర్లలో 140 పరుగులకు ఆల్ అవుట్ కావడంతో 51 పరుగులు తేడాతో రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు విజయం సాధించింది. అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న తుంగభద్ర వారియర్స్ జట్టు బౌలర్లు ఎం.ఎం.కుమార్ 0 పరుగులకే అవుట్ చేసినప్పటికీ రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు కెప్టెన్ రషీద్ బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి 48 బంతులలో రెండు సిక్సులు ఆరు ఫోర్ లతో 67 పరుగులు , సత్య సాయి సాత్విక్ 22 బంతులలో నాలుగు సిక్సులు మూడు ఫోర్ లతో 45 పరుగులు చేయగా చివరిలో ఎం.హర్షవర్ధన్ 21 బంతులలో ఒక సిక్స్, నాలుగు ఫోర్ లతో 34 పరుగులు చేయటంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. తుంగభద్ర వారియర్స్ జట్టు బౌలర్లలో తోషిత్ యాదవ్ 2 వికెట్లు, చీపురుపల్లి స్టీఫెన్, సౌరబ్ కుమార్ కె.వి.శశికాంత్ ఒక్కొక్క వికెట్ తీశారు.

192 పరుగులు విజయ లక్ష్యంతో బరిలో దిగిన తుంగభద్ర వారియర్స్ కెప్టెన్ మహీప్ కుమార్ 25 బంతులలో రెండు సిక్స్ లు ఒక ఫోర్ తో 34 పరుగులు చేయగా వికెట్ కీపర్ ఎంకే దత్తారెడ్డి 26 బంతులలో మూడు సిక్సులు రెండు ఫోర్ లతో 37 పరుగులు చేశాడు. అదేవిధంగా జి. రోహిత్ 16 బంతులలో మూడు సిక్సులు ఒక ఫోర్ తో 32 పరుగులు చేసినప్పటికీ మిగిలిన బ్యాటర్లు ఎవరు ఆశించిన

51 పరుగుల తేడాతో తుంగభద్ర వారియర్స్‌పై విజయం ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షేక్ రషీద్

స్థాయిలో రాణించకపోవడంతో తుంగభద్ర వారియర్స్ జట్టు లక్ష్యాన్ని చేదించడంలో విఫలమైంది. అదేవిధంగా రాయల్ ఆఫ్ రాయలసీమ బౌలర్లు గిరినాథ్ రెడ్డి 3.2 ఓవర్లలో 21 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీయగా, జాగర్లపూడి సాకేత్ రాము 3 ఓవర్లలో 8 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి తుంగభద్ర వారియర్స్ బ్యాటర్ లను కట్టడి చేశారు. వీరితోపాటు వినుకొండ వేణు, మాధవ రాయుడు రెండేసి వికెట్లు తీశారు ఈ మ్యాచ్ లో అద్భుత ప్రతిభ కనబరిచి 48 బంతులలో 67 పరుగులు చేసిన షేక్ రషీద్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ లో రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్న రాయల్స్ ఆఫ్ రాయలసీమ కెప్టెన్ షేక్ రషీద్ కు ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ అస్కార్ వినోద్ పదివేల రూపాయల చెక్కు మెడల్ అందజేశారు. పవర్ ఫుల్ స్ట్రైకర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ కె.సత్యసాయి సాత్విక్ (రాయల్స్ ఆఫ్ రాయలసీమ) కు ఏసీఏ సి.ఎఫ్.వో ఎమ్.నవీన్ కుమార్ పదివేల రూపాయల చెక్కు అందజేశారు. బెస్ట్ ఎకానమీ అవార్డ్ అందుకున్న సాకెత్ రామ్ (రాయల్స్ ఆఫ్ రాయలసీమ)కు ఏసీఏ జనరల్ మేనేజర్ డి.శివకుమార్ పదివేల రూపాయల చెక్కు అందజేశారు..క్యాచ్ ఆఫ్ ది ప్లేయర్ అవార్డ్ అందుకున్న కె.ఆనంద్ జోశయ్య (తుంగభద్ర వారియర్స్) కు రాయల్స్ ఆవ్ రాయలసీమ ఓనర్ ఎమ్ శ్రీధర్ పదివేల రూపాయల చెక్కు అందజేశారు.

ఐవిఎఫ్ కేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: సంతానోత్పత్తి కేంద్రాల సందర్శనలో భాగంగా బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వరరావు, వారి బృందంతో కలిసి జిల్లాలో గల ఐవిఎఫ్ కేంద్రములను అనగా అక్షయ ఐవిఎఫ్, రోషిణి ఫెర్టిలిటీ, లైఫ్ ఫెర్టిలిటీ, నికిత హాస్పిటల్ కేంద్రములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కేంద్రాలలో అన్ని పత్రాలను, రిజిస్ట్రేషన్, రికార్డులను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంత మందికి సంతానోత్పత్తి చికిత్స చేసారో వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నిజాయితీగా సమాచారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికి అందచేయాలని లేని పక్షంలో అటువంటి వారిపై చర్యలు తీసుకోబడతాయని, ధరలపట్టిక ప్రదర్శించాలని తెలియచేసారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ , ఫారం-ఎఫ్ లను తనిఖీ చేసి ఐఈసి బోర్డులు నిర్దేశించిన ప్రదేశం లో ఉంచాలని సమయానికి రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్ని సంతానోత్పత్తి కేంద్రాలను ఆదేశించారు. ఈ తనిఖీలో డిపిఓ ఎన్ హెచ్ ఎం డా.బి.ఉమావతి, డెమో బి.నాగేశ్వర రావు, డెమో పాల్గొన్నారు.